
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

శనివారం 17 ఆగస్టు 2024 | 3





కడుపు నిండా..



నిరుపేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు... రామచంద్రపురం, మండపేటల్లో ప్రారంభం



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, ఆగస్టు 16: రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చేందుకు టీడీపీ ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను జగన్ కక్షపూరితంగా మూసేసి పాపం మూటకట్టుకున్నాడని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దాతలు కూడా తమ వంతు సహకారం అందిం చాలని వారు పిలుపునిచ్చారు. మండపేట-ఏడిద రోడ్డులో అన్న క్యాంటీన్‌ను ఎంపీ హరీష్, ఎమ్మెల్యే జోగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. తొలిరోజు మధ్యాహ్నం సుమారు 350 మంది భోజనం చేశారు. ఎంపీ హరీష్, ఎమ్మెల్యే వేగుళ్ల, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అల్పాహారం తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు యరగతపు బాబ్జీ, మున్సిపల్ కమిషనర్ బి.రాము, డీఈఈ శ్రీనివాస్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఆగస్టు 16: నిరుపేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లను పునః ప్రారంభిస్తున్నామని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం పాత బస్టాండు సమీపంలో అన్న క్యాంటీన్‌ను శనివారం ఆయన కలెక్టరు మహేష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రిసుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎంపీ హరీష్‌మాధుర్ అల్పాహారం వడ్డించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 100 క్యాంటీన్లు ప్రారంభించామని, మరో 75 క్యాంటీన్లను త్వరలో ప్రారంభిస్తామన్నారు. అల్పాహారం, భోజనం పూర్తి నాణ్యతతో పెడతామన్నారు. వచ్చిన వారందరికీ భోజనం పెట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతిరోజూ తాను అల్పాహారం ఇక్కడే చేస్తానని, వారానికి ఒకసారి భోజనం కూడా చేస్తానన్నారు. ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన భోజనం పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళిక రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సుధాసాగర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవిశ్రీధర్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కడియాల రాఘవన్, ఏఎంసీ మాజీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, టీడీపీ నాయకులు అక్కల రిష్వంత్‌రాయ్, కొసనా శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, కొత్తపల్లి శ్రీను, గుణ్ణం వినోద్‌కుమార్, నందూరి ఫణికుమార్, దంగేటి గౌరీశంకర్, వెలుగుబంట్ల లక్ష్మణరావు, జాస్తి విజయలక్ష్మి, అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రబాబుకు ఎంత పుణ్యమో...

కుడుపూడి సత్యవతి, పసలపూడి, రాయవరం మండలం

మాది రాయవరం మండలం పసలపూడి. ఏరియా ఆసుపత్రిలో మనుమరాలు చికిత్స పొందుతుంటే చూడ్డానికి వచ్చాను. అన్న క్యాంటీన్లో భోజనం చేశాను. పప్పు, కూర, పచ్చడి, పెరుగు వేశారు. చాలా బాగుంది. ఐదు రూపాయలకే భోజనం పెడుతున్న చంద్రబాబుకు ఎంత పుణ్యమో. గతంలో అన్నక్యాంటీన్ ఉన్నప్పుడు కూడా రెండుసార్లు భోజనం చేశాను.

పేదలకు వరం

తాతపూడి వెంకట్, కార్మికుడు, మండపేట



పట్టణానికి వచ్చి కూలి పనులు చేసుకునే కార్మికులకు అన్న క్యాంటీన్ ఒక సంజీవని వంటిది. బయట భోజనం చేయాలంటే రూ.100 అవుతోంది. కానీ అన్న క్యాంటీన్‌లో రూ.5కే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం రూ.5కే భోజనం, రాత్రి భోజనం రూ.5కే ప్రభుత్వం అందిస్తుండడం వల్ల కార్మికుల ఆకలి తీరుతుంది. పేదల ఆకలి తీర్చేందుకు సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం బాగుంది.

సంతోషంగా ఉంది

నూకమిల్లి ఆనంద్, కార్మికుడు మండపేట



ఐదేళ్ల క్రితం మూసేసిన క్యాంటీన్లను పునః ప్రారంభించడం బాగుంది. రూ.15కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం అందించడం మాబోటి వాళ్లకి ఎంతో మేలు చేస్తుంది. బయట మార్కెట్లో టీ రూ.10, ఇడ్లీ రూ.30, దోశ రూ.50 అమ్ముతున్న వేళ మాలాంటి వాళ్లు, పని చేసుకునేవాళ్లు, వృద్ధులు కొనే స్తోమత లేక ఇబ్బంది పడుతున్నాం. అన్న క్యాంటీన్ల ద్వారా కడుపునిండా భోజనం దొరుకుతోంది.



వరలక్ష్మీ నమోస్తుతే!

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీవ్రతాన్ని జిల్లాలోని మహిళలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు. అమ్మవారి విగ్రహాలను అందంగా అలంకరించి పూజలు చేశారు. తోరణాలు కట్టుకుని ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చారు. అనంతరం అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. రాయవరం మండలం సోమేశ్వరంలో విశేష అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు (పై చిత్రం), అంతర్వేది ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

.... వివరాలు 6లో



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అదనపు ఎస్పీగా ఏవీఆర్‌పీబీ ప్రసాద్ నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా అదనపు ఎస్పీ (క్రైం)గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను కోనసీమ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అదనపు ఎస్పీగా వున్న ఖాదర్ బాషాను పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.





అన్న క్షేత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అన్న క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారం

రావులపాలెం, ఆగస్టు 16: అన్న క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పొడగట్లపల్లిలో హరే కృష్ణ ఉద్యమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడి నుంచి సరఫరా చేస్తున్న ఆహారం, ముడిసరుకుల నాణ్యత, వంట గదులను చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఆరు అన్న క్యాంటీన్లకు ఇక్కడి నుంచే పదార్థాలను సరఫరా చేస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఆహారం సరఫరా చేస్తామన్నారు. అన్నా క్షేత్రం ద్వారా ఒక రోజుకి ఎంత మంది ఆహారం సరఫరా చేయవచ్చు అని హరేకృష్ణ ఉద్యమం జోన్-1 జనరల్ మేనేజరు శ్రీరామ్ ప్రసాద్‌ను అడగ్గా.. రోజుకు 30వేల మందికి ఆహారం సరఫరా చేయగల సామర్థ్యం ఉన్న కిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. త్వరలోనే జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలకు నాణ్యతవంతమైన ఆహారాన్ని ఈ క్షేత్రం నుంచి సరఫరా చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు ముక్తేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ జలాది సహదేవుడు, సత్తిపండు, త్రిమూర్తులు, నిమ్మకాయల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

రూ.15వేలు పొందుతున్న దివ్యాంగుల ఫించన్లను పునః పరిశీలించాలి

▸▸ కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పూర్తిగా మంచానికి గానీ, వీల్‌చైర్‌కి గానీ పరిమితమైనట్టు సర్టిఫికెట్లు పొంది అధిక మొత్తంలో పింఛన్లు పొందుతున్న దివ్యాంగులను పునఃపరిశీలన చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో దివ్యాంగులకు అందిస్తున్న పెన్షన్లపై శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్షించారు. పూర్తిగా అంగవైకల్యం కలిగి మంచానికి లేదా కుర్చీకే పరిమితమైనట్టు సదరం, మెడికల్ బోర్డు ద్వారా సర్టిఫికెట్లు పొందారన్నారు. అయితే ఎటువంటి సర్టిఫికెట్లు లేకుండా అధిక మొత్తంలో నెలకు రూ.15వేలు వంతున పెన్షన్ తీసుకుంటున్న 668 మందిని ఇప్పటికే గుర్తించారన్నారు. వీరిలో కొందరు అతి తక్కువ దివ్యాంగత్వం కలిగి ఉన్నప్పటికీ రూ.15వేలు వంతున పెన్షను పొందుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 5 రీఎసెస్‌మెంట్ మెడికల్ టీమ్‌లను ఏర్పాటు చేసి ఆయా కేసులను పునః పరిశీలించాలన్నారు. మెడికల్ టీమ్‌లో ఆర్థోపీడిషియన్, ఫిజిషియన్, మెడికల్ ఆఫీసర్ ఉంటారన్నారు. పూర్తిస్థాయి అర్హత పొందిన వారికే పెన్షన్లు అందించాలన్నారు. నెలఖారు నాటికి సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డీపీహెచ్‌ఎస్ కాశీ, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

సీబీఎస్‌ఈ సిలబస్ అనుబంధ పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థు లపై ప్రత్యేక దృష్టిసారించి అధిక ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టల్ నిర్వహణ విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆయన శాఖల వారీగా సమీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలన్నారు. జిల్లాలోని 55 బీసీ, ఎస్సీ వెల్ఫేర్ వసతి గృహాల్లో ఉన్న పిల్లల వివరాలు, అందిస్తున్న భోజనం, కాస్మోటిక్స్ ఛార్జీలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. సీబీఎస్‌ఈ సిలబస్ అనుబంధ గురుకుల పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి పక్కా ప్రణాళికతో వారంతా ఉత్తీర్ణలయ్యేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి జ్యోతిలక్ష్మీదేవి, డీఈవో ఎం.కమలకుమారి, వసతి గృహాల అధికారులు, గురుకులాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



పాచిక పారలేదు!

- ఉమ్మడి జిల్లాలో ఖనిజ సీనరేజీ డబ్బులు ఎగ్గొట్టాలన్న సుధాకర్ ఇన్‌ఫ్రా ప్లాన్‌కు గండి
- బాకీ పడ్డ రూ.44 కోట్లు కట్టకుండా తప్పించుకోవాలన్న ప్రయత్నం బెడిసికొట్టిన వైనం
- కంపెనీ ఆటలు సాగనివ్వని ప్రభుత్వం : 15 రోజుల్లోగా జమ చేయాల్సిందేనని ఆదేశాలు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిచిపోయిన సీనరేజీ వసూళ్ల దందా
- గత జగన్ సర్కారు ఓ కంపెనీకి రూ.20 కోట్లు సీనరేజీ రద్దును సాకుగా చూపిన కంపెనీ
- ఆ రద్దు చేసిన సీనరేజీ వల్ల తనకు రాబడి తగ్గిపోయిందంటూ అడ్డగోలు వాదన
- తమ కంపెనీ కట్టాల్సిన బాకీలో ఆ డబ్బు మినహాయించాలంటూ తప్పించుకునే యత్నం
- ఈలోపు అనూహ్యంగా ప్రభుత్వం మారడంతో కంగుతిన్న సుధాకర్ ఇన్‌ఫ్రా

ప్రభుత్వానికి బాకీ పడ్డ ఖనిజ సీనరేజీ డబ్బులు ఎగ్గొట్టాలన్న సుధాకర్ ఇన్‌ఫ్రా కంపెనీ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. అడ్డగోలు వాదనలతో ప్రభుత్వ ఖజానాకు పంగనామాలు పెట్టాలనుకున్న ప్రణాళికలు పటాపంచలయ్యాయి. బాకీ డబ్బులు రూ.44 కోట్లు కట్టి తీరాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. అది కూడా 15రోజుల్లోగా ఖజానాకు జమచేయాలని హెచ్చరించింది. గత వైసీపీ ప్రభుత్వ అండతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ కంపెనీ యథేచ్ఛగా చెలరేగి పోయింది. ఎక్కడికక్కడ ముక్కుపిండి సీనరేజీ కోట్లలో పిండేసింది. ప్రభుత్వానికి నెలకు రూ.9.70 కోట్లు కట్టి అంతకు పదింతలు రాబట్టేసింది. తీరా అనుహ్యంగా ప్రభుత్వం మారడంతో కంపెనీకి ఝులక్ తగిలింది. అడ్డగోలు సీనరేజీ దందా ఆగిపోయింది. ఈ సాకుతో సర్కారు బాకీ ఉన్న బకాయిలు కట్టకుండా తప్పించుకునే ప్రయత్నం చేసినా వారి పాచిక పారలేదు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గనులశాఖకు చిన్నతరహా ఖనిజాల ద్వారా ఏటా కోట్లలో ఆదాయం సమకూరుతోంది. గ్రావెల్, నల్లరాతి కొండలు, మట్టి, లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా భారీగా ప్రభుత్వానికి రాబడి వస్తోంది. అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా ఎక్కువ రాబడి వస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ రాబడి గనులశాఖకు బదులు మొట్టమొదటిసారిగా కోనసీమ జిల్లాకు చెందిన సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి అడ్డగోలుగా కట్టబెట్టేసింది. సీనరేజీ వసూలు బాధ్యత నుంచి గనులశాఖను తప్పించి సదరు కంపెనీకి అప్పగించేసింది. గనుల శాఖను డమ్మీగా మార్చేసి, సీనరేజీ వసూలు బాధ్యతంతా సుధాకర్ ఇన్‌ఫ్రాకు ఇచ్చేసింది. అందులోభాగంగా 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు ఈ కంపెనీ ఉమ్మడి జిల్లాలో సీనరేజీ వసూలు చేసుకునేలా అధికారం కట్టబెట్టింది. ఈ రెండేళ్లకు కలిపి రూ.233 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తేచాలని, అది కూడా భారం అయితే ఇందులో నెలనెలా రూ.9.70కోట్లు చొప్పున 24 వాయిదాల్లో చెల్లించాలని వెసులుబాటు ఇచ్చింది. ఇలా కంపెనీకి పూర్తి సహకారం అందించి ప్రభుత్వ పెద్దలు తెరవెనుక భారీగా పిండేశారు. అటు ప్రభుత్వం అండదడంలు ఉండడంతో సుధాకర్ ఇన్‌ఫ్రా ఉమ్మడి ఇటీవల ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఉమ్మడి జిల్లాను పిండేసింది. ఎక్కడికక్కడ కొండలు, గుట్టలు, గ్రావెల్, క్వారీలు ఉన్న ప్రతిచోటా సొంతంగా మనుషులను నియమించింది. సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసింది. ఎవరు ఏ చిన్న మట్టి/గ్రావెల్ తవ్వుకున్నా ముక్కుపిండి సీనరేజీ వసూలుచేసింది. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్లరాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి కూడా వదలకుండా నెలనెలా కోట్లలో రాబట్టింది. ఈ కంపెనీకి తెరవెనుక వైసీపీ పెద్దల సహకారం ఉండడంతో గనులశాఖ కళ్లు మూసేసుకుంది. సీనరేజీ వసూళ్లలో నిబంధనలు ఉల్లంఘించినా కన్నెత్తి చూడలేదు. దీంతో ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ.9.70 కోట్ల కంటే పదింతల రెట్టింపు ఆదాయం పిండేసింది. ఇలా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కంపెనీకి కాసుల పంట పండింది. రెండేళ్లలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తంలో సింహభాగం తొలి ఆరు నెలల్లోనే లాగేసింది.

సీనరేజి చెల్లించడం ఆపేసి..

అయితే అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయన్న సమయంలో సదరు కంపెనీ ప్రభుత్వానికి సీనరేజీ డబ్బులు చెల్లించడం ఆపేసింది. ఇదేంటని గనులశాఖ అడిగితే జగన్ ప్రభుత్వం కాకినాడ జిల్లాలో ఓ కంపెనీకి భారీ లబ్ధి చేకూర్చిందని మెలిక పెట్టింది. వాస్తవానికి ఎవరికీ తెలియకుండా గుట్టుగా గత ప్రభుత్వం జిల్లాలో తీరప్రాంతంలో పనులు చేస్తోన్న ఓ ప్రముఖ కంపెనీకి సహకరించింది. రౌతులపూడి నుంచి ఈ కంపెనీ 12 లక్షల మెట్రిక్ టన్నుల నల్లరాయి తరలించగా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.20 కోట్ల రాయల్టీని రద్దుచేసి మేలు చేకూర్చింది. ఇదంతా రహస్యంగా ఉంచింది. విషయం తెలుసుకున్న సుధాకర్ ఇన్‌ఫ్రా గనులశాఖపై ఒత్తిడి తెచ్చింది. ఆ కంపెనీకి రూ.20 కోట్ల రాయల్టీ రద్దు చేయడం వల్ల తమకు రావలసిన సీనరేజీ ఆదాయం పోయిందని అభ్యంతరం తెలిపింది. అందువల్ల తాము నెలనెలా చెల్లించాల్సి ఉన్న బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ కొత్తపాట పాడింది. అయితే కంపెనీ వెనుక వైసీపీ నేతలు ఉండడంతో గనులశాఖ మొత్తబడింది. దీంతో తన ఆటలు సాగినట్లేనని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన తన బాకీ కట్టకుండా ఉండొచ్చని లెక్కలేసుకుంది. ఎన్నికలు జరిగినా తిరిగి వైసీపీ ప్రభుత్వం వస్తుందనే ధీమాతో సదరు కంపెనీ అలా తన బాకీలు కట్టకుండా ఉండిపోయింది. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కంపెనీ కంగుతింది. ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా సీనరేజీ వసూలు కాంట్రాక్టు రద్దయిపోయింది. అటు కట్టాల్సిన బాకీలు చెల్లించాలంటూ గనులశాఖ ఒత్తిడి తేవడం మొదలుపెట్టింది. కొత్త ప్రభుత్వంలో పైరవీలు చేసి బాకీలు కట్టకుండా చేయాలని సదరు కంపెనీ ప్రయత్నాలు చేసింది. కానీ ప్రభుత్వం నుంచి సదరు కంపెనీకి సహకారం దొరకలేదు. సరికదా మొత్తం సీనరేజీ బాకీలన్నీ కలిపి రూ.44కోట్లు కట్టితీరాలని ఇటీవల గట్టిగా హెచ్చరించింది. 15రోజులలోగా ఖజానాకు డబ్బులు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది. ముందు బాకీ చెల్లిస్తే తర్వాత రాయల్టీ రద్దులో సుధాకర్ ఇన్‌ఫ్రాకు అసలు సీనరేజీ రావలసి ఉందా? లేదా? తేల్చుదామని పేర్కొంది. దీంతో సుధాకర్ ఇన్‌ఫ్రా గింజుకుంటోంది.



అర్చకుల నివాస గృహాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే సత్యానందరావు

వాడపల్లి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

ఆత్రేయపురం, ఆగస్టు 16: రాష్ట్రంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంతో పాటు భక్తుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. వాడపల్లిలో రూ. 1.30 కోట్లతో నిర్మించిన అర్చకుల నివాస గృహాలను, రూ.12.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం వారు ప్రారంభించారు. రూ.40లక్షలతో ఏటిగట్టు వద్ద పార్కింగ్ ప్రదేశంలో అభివృద్ధి పనులకు, రూ.45 లక్షలతో ఏటిగట్టుపై రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శ్రీనివాస ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు. ప్రసాద్ స్కీమ్ ఈ ఆలయానికి వర్తించేలా కృషి చేస్తానని ఎంపీ హరీష్ తెలిపారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దూరి సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ ధర్నాల రామకృష్ణ, బండారు బాబి, యేపుగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అల్లవరం మండలం బోడసకుర్రు వైనతేయ బ్రిడ్జి వంతెనవద్ద కనువిందు చేసిన మేఘాలు

కారుమబ్బులు కమ్మిన వేళ...

కారుమబ్బులు కనువిందు చేశాయి. ఒకపక్క తీవ్రమైన ఎండ ఉన్నా మరోపక్క నల్లని మబ్బులు ఆకాశాన్ని కమ్ముకుని చూపరులను ఆనందపరవశం చేశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు వైనతేయ బ్రిడ్జి వద్ద శుక్రవారం కనిపించిన ఈ అందమైన మేఘాలు ఔరా అనిపించాయి.

- అల్లవరం

ఏఎస్ఐకి ఐపీఎం అందజేత



ఏఎస్ఐ మాడా సత్యనారాయణకు పతకాన్ని అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న మాడా సత్యనారాయణ కు ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం)ని ఎస్పీ నరసింహ కిశోర్ శుక్రవారం అందజేశారు. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సత్యనారాయణకు కేంద్ర ప్రభుత్వం ఐపీఎంని ప్రకటించింది. ఈ సందర్భంగా సత్యనారాయణను ఎస్పీ నరసింహ కిశోర్, అధికారులు, సిబ్బంది అభినందించారు. ఈ ఏడాది జిల్లా ఫైర్ ఆఫీసర్ చిన్నం మార్టిన్ లూథర్ కింగ్‌కు ఐపీఎం ప్రకటించింది. ఈ పతకాన్ని వచ్చే ఏడాది అందజేస్తారు.

19 నుంచి ఏపీఈఏపీసెట్

మూడోదశ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్

- ఈనెల 21 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన
- 20 నుంచి 22 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు
- కాకినాడ ఏపీటీలో సహాయ కేంద్రం ఏర్పాటు

జేఎన్టీయూకే, ఆగస్టు 16: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్ల భర్తీకి సంబంధించిన ఏపీఈఏపీసెట్-2024 వెబ్ ఆధారిత కౌన్సెలింగ్‌ను మొదటి, రెండో దశ ద్వారా నిర్వహించారు. అయితే రాష్ట్రస్థాయిలో సుమారు 18వేలకు పైగా ఇంజనీరింగ్ సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయని వాటిని భర్తీచేసేందుకు మూడోదశ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి కూటమి ప్రభుత్వానికి, విద్యాశాఖామంత్రి నారాలోకేష్‌కి అభ్యర్థనలు రావడంతో సీటుకోసం ఎదురుచూస్తున్న ఏ ఒక్క విద్యార్థి నష్టపోకూడదని మూడో దశ వెబ్ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ఏపీఈఏపీసెట్-2024 మూడవ, తుది రౌండ్ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 19 నుంచి ప్రారంభం కానుంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లో మొదటి, రెండో దశ వెబ్‌కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ శుక్రవారం జారీ చేస్తున్నట్లు సమాచారం. ఈ కౌన్సెలింగ్ ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలోని 29 ఇంజనీరింగ్ కళాశాలల్లో మిగిలిపోయిన సుమారు 2900 సీట్లు భర్తీ కానున్నాయి. ఈనెల 19నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవచ్చని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురం ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రం సమన్వయ కర్త, ప్రిన్సిపాల్ ఎన్. జనార్ధన్‌రావు తెలిపారు.

● అయితే మొదటి, రెండో దశ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరు కాని అభ్యర్థులు మాత్రమే షెడ్యూల్‌లో పేర్కొన్నవన్నీ చేయాలి. ఆవిధంగా కాకుండా మొదటి, రెండోదశ కౌన్సెలింగ్‌లో సీటు పొంది తుది దశకు కూడా ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు కేవలం వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకుంటే సరిపోతుంది. అంతేకాకుండా మొదటి, రెండో దశలో పొందిన సీటు మూడోదశలో సంబంధిత విద్యార్థికి సీటుకేటాయింపు జరిగిన వెంటనే రద్దవుతుంది. ఇప్పటివరకూ వెబ్‌కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు, అదే విధంగా కళాశాలలో చేరని విద్యార్థులు ఈఅవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి.

●అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సహాయకేంద్రంలో సంప్రదించాలి. అంతేకాకుండా 7995681678, 7995865456, 9177927677 హెల్ప్ డెస్క్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

● ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలాచేసుకోవాలి

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తోంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6నుంచి ఇంటర్ వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు. ర్యాంకు కార్డు,రేషన్ కార్డు, హాల్ టికెట్లను అప్‌లోడ్‌చేయాలి. ఈడబ్ల్యూఎస్ కులధ్రువీకరణపత్రం ఉన్న వారికి 2022నుంచి 10శాతం రిజర్వేషన్‌ను ప్రతీఏడాది అమలుచేస్తున్నారు.

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి

ర్యాంకు కార్డు, మార్కులజాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి.

షెడ్యూల్ ఇదే

- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన : ఈనెల 19 నుంచి 21 వరకూ.
- అప్‌లోడెడ్ ధ్రువపత్రాల పరిశీలన : ఈనెల 19 నుంచి 22 వరకూ
- వెబ్ ఆప్షన్ల నమోదు :ఈనెల 20 నుంచి 22 వరకూ.
- ఆప్షన్ల మార్పు : ఈనెల 23
- సీట్ల కేటాయింపు : ఈనెల 26
- సెల్ఫ్ రిపోర్టింగ్, కళాశాలల్లో రిపోర్టింగ్ : ఈనెల 26 నుంచి 30 వరకూ

వరలక్ష్మీ శోభ

- పాదగయకు పోటెత్తిన భక్తులు...
- పుష్కరిణిలో స్నానాలు ● బంగారం చీరతో దర్శనమిచ్చిన బాలాత్రిపుర సుందరీ అమ్మవారు



పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పిఠాపురం, ఆగస్టు 16: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. క్షేత్రానికి శ్రావణవరలక్ష్మీ శోభ చేకూరింది. పాదగయ పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించి పూజలు చేశారు. పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో వెలసిన రాజారాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తిపీఠాల్లో దశమశక్తి పీఠాధిపతి అయిన పురుహుతికా అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం వరలక్ష్మివ్రత పూజల సందర్భంగా వ్రతాన్ని ఆచరించే భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. రాజరాజేశ్వరీదేవి, పురుహుతికాఅమ్మవార్లకు కుంకుమపూజలు, ప్రత్యేక అర్చనలు జరిగాయి. పుష్పార్చన చేశారు.





పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి, పురుహుతికా అమ్మవారు

బంగారు చీరలో బాలాత్రిపురసుందరి

పోర్టుసిటీ (కాకినాడ): కాకినాడలో ప్రసిద్ధి చెందిన స్థానిక సూర్యారావుపేటలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారు భక్తులకు బంగారుచీరలో దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని అమ్మవారి ని దర్శించుకునేందుకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామునుంచే దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చింతపల్లి విజయభాస్కరరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.



కాకినాడలో బంగారు చీర అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు



సామర్లకోట భీమేశ్వరాలయంలో వెండి చీర అలంకరణలో అమ్మవారు

వెండిచీర అలంకారంలో బాలాత్రిపుర సుందరి

సామర్లకోట: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఉన్న బాలాత్రిపురసుందరి అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరులచే విశేష పుష్పార్చన పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారిని సుమారు 30కిలోలతో రూపొందించిన వెండిచీరతో సర్వాంగసుం దరంగా అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు.



మామిడికుదురు: అప్పనపల్లి ఆలయంలో గాజుల అలంకరణలో పద్మావతి అమ్మవారు



వాడపల్లిలో పవిత్రాలతో కొలువుతీరిన ఉత్సవమూర్తులు, మహా పూర్ణాహుతిలో ఎమ్మెల్యే, ఎంపీ

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

- మూడు రోజుల పాటు పూజలు ● పాల్గొన్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, ఆగస్టు 16: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు తిరుమల తరహాలో క్రతువును వైఖానసాగమశాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వసంత మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను పవిత్రా లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహాశాంతి హోమం, ప్రాయశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, పవిత్రవిసర్జన, మహాదాశ్వీరచనలను వైభవంగా నిర్వహించారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మహా పూర్ణాహుతిలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉపకమిషనరు కిషోర్‌కుమార్, దేవదాయశాఖ జిల్లా అధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, అధికార పార్టీ ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

25న జాంపేట అర్బన్ బ్యాంక్ ఎన్నిక

- 12 డైరెక్టర్ పదవులకు 37 నామినేషన్లు దాఖలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : జాంపేట కోపరేటివ్ అర్బన్ పాలక వర్గ ఎన్నికలకు శుక్రవారం మొత్తం 37 మంది నామినేషన్లు దాఖలు చేసినట్టు రాజమహేంద్రవరం డివిజనల్ కోపరేటివ్ అధికారి, ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఛైర్మన్ అభ్యర్థి బొమ్మన జయకుమార్‌తోపాటు ప్రస్తుత పాలకవర్గ డైరెక్టర్ ప్రసాదుల హరనాథ్ తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు. బ్యాంక్‌కు సంబంధించిన మొదటి నియోజకవర్గంలో 10 డైరెక్టర్ పదవులకు 30మంది నామినేషన్లు దాఖలుచేయగా, 2వ నియోజక వర్గంలో ఒక పదవి కోసం ఇద్దరు, మూడో నియోజకవర్గంలో ఒక పదవి కోసం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం స్క్రూటినీ ఉంది. ఆదివారం నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. జాంపేట ప్రధాన బ్యాంక్ పరిధిలోని 10మంది కంటే ఎక్కువమంది నిలబడితే ఎన్నిక తప్పదు. మిగతాచోట్ల ఒకరికన్నా ఎక్కువ మంది ఉన్నా పోలింగ్ తప్పదు. 25న పోలింగ్ నిర్వహిస్తారు. ఛైర్మన్ అభ్యర్థి బొమ్మన జయకుమార్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు హాజరయ్యారు. బ్యాంక్‌లో సుమారు 32వేలకుపైగా ఓటర్లు ఉండగా 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారన్నారు. ప్రధాన బ్రాంచి జాంపేట, మోరంపూడి ధవళేశ్వరం, సీతంపేట, అనపర్తి, గోకవరం, పెద్దాపురం, కాకినాడ, ఏలూరు, కొవ్వూరుల్లో మొత్తం 10 బ్రాంచిలు ఉన్నాయన్నారు. ఈ బ్యాంక్ పరిధిలోని బ్రాంచిలను మూడు నియోజకవర్గాలుగా విభజించారు. మొదటి నియోజకవర్గంలో జాంపేట మెయిన్ బ్రాంచి ఒకటి. ఇక్కడ 15,623 మంది ఓటర్లు ఉన్నారు. మోరంపూడి బ్రాంచిలో 2142 మంది ఓటర్లు, ధవళేశ్వరం బ్రాంచిలో 3221 మంది ఓటర్లు, సీతంపేట బ్రాంచిలో 2766 మంది ఓటర్లు కలిపి మొత్తం 23,752 మంది ఉన్నారు. వీరు మొత్తం 10 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఇక నియోజకవర్గం 2 పరిధిలో మొత్తం 1901 మంది ఓటర్లు ఉన్నారు. వీరు ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. ఈ నియోజకవర్గం పరిధిలో రెండు బ్రాంచిలు ఉన్నాయి. అనపర్తిలో 963 మంది ఓటర్లు ఉన్నారు. గోకవరం బ్రాంచిలో 938 మంది ఉన్నారు. మూడో నియోజకవర్గంలో నాలుగు బ్రాంచిలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 2071 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. పెద్దాపురం బ్రాంచిలో 963 మంది, కాకినాడ బ్రాంచిలో 834 మంది, ఏలూరు బ్రాంచిలో 480 మంది, కొవ్వూరు బ్రాంచిలో కేవలం ఏడుగురు ఓటర్లు ఉన్నారు.

గంజాయి తాగాలని వేధించినందుకు హత్య

- హత్య కేసులో నిందితుల అరెస్ట్



రాజోలులో నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ గోవిందరాజు

రాజోలు, ఆగస్టు 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెల్లంకకు చెందిన పడమటి నోయల్‌జార్జిన్‌ను హత్య చేసిన కేసులో నిందితులు రాపాక ప్రకాష్, ప్రశాంతి, యర్రంశెట్టి ప్రేమ్‌కుమార్లను శుక్రవారం అరెస్టు చేసినట్టు రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపారు. రాజోలు సర్కిల్ కార్యాలయంలో ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మలికిపురానికి చెందిన నోయల్‌జార్జి కనిపించడంలేదని నోయల్ తండ్రి పడమటి రత్నంరాజు మలికిపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ఉత్తర్వుల ప్రకారం కొత్తపేట డీఎస్పీ ఆదేశాలతో సీఐ ఆధ్వర్యంలో మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. గుడిమెల్లంకకు చెందిన రాపాక ప్రశాంతి ఆరు నెలల క్రితం మలికిపురానికి చెందిన నోయల్‌జార్జిను ప్రేమించింది. వీరు కాకినాడలో నివాసం ఉన్నారు. నోయల్‌జార్జి మందు, సిగరెట్, గంజాయికి బానిసై ప్రశాంతిని కూడా తాగమని వేధించేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక ప్రశాంతి ఈనెల 9న అన్నయ్య రాపాక ప్రకాష్‌కు విషయాన్ని వివరించింది. ప్రకాష్ తన స్నేహితుడు రాజోలుకు చెందిన యర్రంశెట్టి ప్రేమ్‌కుమార్, ప్రశాంతితో కలిసి నోయల్‌జార్జిని హత్య చేసేందుకు ప్రణాళిక చేశారు. ఈనెల 9వ తేదీన రాత్రి ప్రశాంతితో నోయల్‌జార్జికి ఫోన్ చేయించి దిండి-చించినాడ బ్రిడ్జి వద్దకు రప్పించారు. ఇనుపరాడ్లతో జార్జిని కొట్టి చంపి గోదావరిలోకి పడేశారు. జార్జి బైక్‌ను బ్రిడ్జి వద్ద పెట్టి అక్కడి నుంచి అదృశ్యమైనట్టు సృష్టించి పరారయ్యారు. ఈనెల 13న జార్జి మృతదేహం అంతర్వేది పల్లిపాలెం అన్నాచెల్లెల గట్టు సమీపంలో గోదావరి గట్టున లభ్యమైంది. ఈనెల 15న దిండి చెక్‌పోస్టు వద్ద నిందితులు ప్రకాష్, ప్రేమ్‌కుమార్, ప్రశాంతిని అరెస్టు చేశామన్నారు.

చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా బదిలీ



బదిలీపై వెళుతున్న చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు, ఆగస్టు 16: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూ రు ఏఎస్పీ రాహుల్ మీనా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్రముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాహుల్‌మీనా గత ఏడాది మే1న చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. రాహుల్‌మీనాకు పదోన్నతి కల్పిస్తూ ఎస్ఆర్‌పీ గుంతకల్ ఎస్పీగా బదిలీ చేశారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన పంకజ్‌కుమార్ మీనాకు చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పంకజ్ కుమార్ మీనా ఇప్పటివరకు గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండర్‌గా విధులు నిర్వర్తించారు.

నేడు జీఎస్ఎల్-స్వతంత్ర హాస్పిటల్స్ వార్షికోత్సవం

రాజానగరం, ఆగస్టు 16: ఈనెల 17న జీఎస్ఎల్-స్వతంత్ర హాస్పిటల్స్ 38వ వార్షికోత్సవాన్ని రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు సినీ దర్శకుడు వి.సందీప్ రెడ్డి వంగా ముఖ్యఅతిథిగా విచ్చేస్తార న్నారు. గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎస్పీ నరసింహ కిషోర్ పాల్గొంటున్నట్టు చెప్పారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు వీర్రాజు

ఆలమూరు, ఆగస్టు 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మోదుకూరులో పంట చేలో ఒక రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గుమ్మిలేరుకు చెంది న ముచ్చారి వీర్రాజు (40)గ్రామ సరిహద్దులో ఉన్న మోదుకూరు పంట భూములలోకి పాడిగేదెకు పచ్చగడ్డి నిమిత్తం వెళ్లాడు. పచ్చగడ్డి కోసి మోపు తీసుకుని వస్తుండగా 33కేవీ విద్యుత్‌లైన్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. వీర్రాజుకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఏఎన్ఎం దుర్మరణం



మృతిచెందిన ఏఎన్ఎం నాగసత్యవేణి

సామర్లకోట, ఆగస్టు 16: కాకినాడ జిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ సమీపాన స్కూటీపై వస్తున్న ఏఎన్ఎంను లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలోని వేట్లపాలెం పీహెచ్‌సీలో ఏఎన్ఎంగా పని చేస్తున్న నాగసత్యవేణి (39) శుక్రవారం సాయంత్రం స్కూటీపై సామర్లకోట వైపు వస్తుండగా ఓవర్‌టేక్ చేస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ఏఎన్ఎం తీవ్రంగా గాయపడింది. తలకు బలమైన గాయాలుకావడంతో హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్పటివరకు తమతో విధులలో పాల్గొన్న తమ సహచరురాలు నాగసత్యవేణి ప్రమాదంలో మృతి చెందిందన్న సమాచారం తెలిసి వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేసును సామర్లకోట పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుషోత్తపట్నం దేవస్థానం భూముల్లో

మళ్లీ రాజుకున్న రగడ

- కోర్టు దిక్కారణ కేసున్నా పురుషోత్తపట్నంలో ఆగని నిర్మాణాలు
- భద్రాద్రి దేవస్థానం ఈవోపై దాడికి యత్నం, అడ్డుకున్న సిబ్బంది



దేవస్థానం అధికారులు, నిర్మాణదారుల మధ్య తోపులాట దృశ్యం

ఎటపాక ఆగస్టు 16 : ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి రామయ్య భూముల్లో మళ్లీ ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో రాష్ట్ర హైకోర్టు భద్రాద్రి దేవస్థానంకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా దానిని నిర్ణీత సమయంలో అమలు చేయకపోవడంతో భద్రాద్రి దేవస్థానం రాష్ట్రీయ వానరసేన కోర్టు దిక్కరణ పిటీషన్ హైకోర్టులో దాఖలు చేశాయి. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలు చోటుచేసుకోకుండా చూడాల్సిన రెవెన్యూ పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛ గా అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నాయని దేవస్థానం అధికార వర్గాలు ఆరోపిస్తున్నాయి. పురుషోత్తపట్నంలోని శ్రీగోకులంకు ఎదురుగా ఉన్న ఖాళీ భూముల్లో గత రెండు నెలలుగా అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటున్నా రెవెన్యూశాఖ అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంతో శుక్రవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, తన సిబ్బంది అక్కడికి చేరుకొని అక్రమ నిర్మాణంను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిపై దాడికి ప్రయత్నించగా దేవస్థానం సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సమయంలో పలువురు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలను తొలగించే ప్రయత్నం సిబ్బంది చేస్తుండగా వాటిని ఇంటి నిర్మాణదారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో మళ్లీ వాగ్వివాదం, దూషణలు చోటుచేసుకున్నాయి. ఎస్ఐ పార్థసారథి తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని నిర్మాణం చేస్తున్న వారిని పనులు ఆపాలని స్పష్టం చేశారు.

మీరు తొలగిస్తారా.. ...మేమే తొలగించాలా..

ఎటపాక ఆర్ఐతో దేవస్థానం ఈవో రమాదేవి

నేను కూడా రెవెన్యూ డిపార్టుమెంటు నుంచే వచ్చాను....దేవస్థానం భూముల్లో నిర్మాణాలు జరుగుతుంటే మీరేం చేస్తున్నారని ఆర్ఐ బాపిరాజును దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి నిలదీశారు. రామాలయ భూముల్లో ఇళ్ల కట్టేందుకు పట్టా ఉందా....లేక అనుమతులు ఉన్నాయా.. మేము తీసేందుకు వస్తే మాత్రం మీరొస్తున్నారు... అక్కడి వారు నిర్మాణ పనులు చేస్తుంటే మీరు దగ్గరుండి ఏం చేస్తున్నారని ఈవో ఆర్ఐని ప్రశ్నించారు. మీ వ్యక్తిగత ఆసక్తి ఏమైనా ఉందా, రెవెన్యూ శాఖ తరఫున మీరేం చేస్తున్నారని ఆర్ఐని ఈవో నిలదీశారు. రాముడి భూములంటే మీకు బాధ్యత లేదా, గత ప్రభుత్వ హయాంలో అధికారులు పట్టించుకోలేదు. ప్రభుత్వం మారిన తరువాత ఇరువురు సీఎంలు భూముల విషయమై చర్చిస్తున్నారు. ఈ సమయంలో కూడా మీరు ఎందుకు పట్టించుకోవడంలేదని ఆమె ప్రశ్నించారు.

బలహీనంగా ఉన్న ఏటిగట్టు పరిశీలన

కపిలేశ్వరపురం, ఆగస్టు 16: కోరుమిల్లి శివారు లాకులు సమీపంలో బలహీనంగా ఉన్న ఏటిగట్టును ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ డీఈ కె.సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. వరదలకు కోతకు గురైన ఏటిగట్టు దిగువ ప్రాంతాన్ని ఇటీవల ఇసుకబస్తాలతో తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో ఆయన ఇక్కడ పరిస్థితులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.ఏఈ కాశీవిశ్వేశ్వరరావు, జేఈ ఎం. రెహమాన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



ద్రాక్షారామ: మాణిక్యాంబ అమ్మవారు, ఆత్రేయపురం: లక్ష్మీదేవి, అమలాపురం: శ్రీదేవి అమ్మవారు, గాజుల గౌరిదేవిగా కనకదుర్గమ్మ, ముమ్మిడివరం: కరెన్సీ నోట్లతో విజయదుర్గమ్మ, యానాం: పాలకనకదుర్గ అమ్మవారు

అంతర్వేది, ఆగస్టు 16: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీరాజ్యాలక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. తొలుత అర్చక స్వాములు అమ్మవార్ని ప్రత్యేక అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఉచితంగా అందించిన పూజా సామగ్రిని భక్తులు తీసుకుని వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

ముమ్మిడివరం: వరలక్ష్మి పూజలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లల్లోని పూజా మందిరాల్లో మండపాలు ఏర్పాటుచేసి వివిధ రకాల పుష్పాలు, పండ్లతో అలంకరించారు. అమ్మవారికి పాయసం, శనగలు, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించి ముత్తయిదువులకు తంబూలాలు అందించారు. అమ్మవారి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపించారు. ముమ్మిడివరంలోని శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామిని కరెన్సీతో విశేషంగా అలంకరించారు. అష్టలక్ష్మి అమ్మవారిని నోట్లతో అలంకరించి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. పెద్ద వంతెన సమీపంలోని శ్రీవిజయదుర్గమ్మ అమ్మవార్ని ధనలక్ష్మీ దేవిగా అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలజీ సన్నిధిలో వేంచేసియున్న పద్మావతి అమ్మవార్ని వరలక్ష్మి వ్రతం సందర్భంగా పాశర్లపూడికి చెందిన గంధం గోపాల్-లహరి దంపతులు మట్టి గాజులతో అలంకరించారు. ఆలయ ప్రధానఅర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవార్కి సహస్ర కుంకుమార్చన పూజలు జరిగాయి. ఆలయంలో మహిళలు సౌభాగ్యం కోరుతూ పూజలు నిర్వహించారు.

పి.గన్నవరం: పి.గన్నవరం, తాటికాయలవారిపాలెం, ముంగండ, గంటిపెదపూడి, ఉడిమూడి తదితర గ్రామాల్లో కనకదుర్గ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. ముంగండ ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన జరిగింది.

రాయవరం: మండలంలోని మహిళలు వేకువజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి వరలక్ష్మి వ్రతాలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వెదురుపాక విజయదుర్గాపీఠంలో గాడ్ కుమార్తె గాదే సత్యవెంకట కామేశ్వరి ఆధ్వర్యంలో గాడ్ కుటుంబ సభ్యులు సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో గాడ్ కుమార్తెలు పెద్దపాటి సత్యకనకదుర్గ, బి.రమ, వాడ్రేవు సూర్య రాజ్యలక్ష్మి, సీతారమ్య పాల్గొన్నారు. గ్రామాల్లో ఇళ్లల్లో మహిళలు వినాయకపూజ, గౌరిపూజ, వరలక్ష్మి అమ్మవారికి అష్టోత్తర, సహస్రనామాలతో సామూహిక కుంకుమ, పుష్పార్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపారు. సోమేశ్వరం శ్రీబాలా త్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, పండు ఆధ్వర్యంలో అమ్మవార్ని వరలక్ష్మి రూపంలో అలంకరించి పూజలు చేశారు. రాయవరం పోలమ్మ అమ్మవారి ఆలయం, బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అమ్మవారి ఆలయం, మాచవరం దేవిసెంటర్‌లో దుర్గాదేవి ఆలయం, పసలపూడి మహాలక్ష్మిదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.

కె.గంగవరం: మహిళలు వరలక్ష్మీదేవి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పిండి వంటలు తయారుచేసి, అమ్మవారి మండపాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

యానాం: యానాంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పిల్లరాయ ఆలయం, పడవలరేవు వీధిలోని శ్రీలలితాదేవి ఆలయం, శివాలయం ప్రాంగణంలోని వాసవికన్యకపరమేశ్వరి ఆలయం, స్థానిక గోపాల్‌నగర్‌లోని శారదా దేవి ఆలయంలో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. దరియాలతిప్ప-గిరియాంపేట రోడ్డులోని పాలకనకదుర్గ అమ్మవారి ఆలయంలో విశేష పుజాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఆలమూరు: మండలంలోని మహిళలు శుక్రవారం ఇంటింటా వర లక్ష్మీ వ్రతం ఆచరించారు. చింతలూరు నూకాంబికా అమ్మ వారి ఆలయం వద్ద దేవస్థానం వద్ద మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. మిగిలిన శుక్రవారాలు కూడా సామూహిక వ్రతాలు జరిపిస్తామని, పూజా సామగ్రిని అందిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండ వల్లి వీర్రాజు తెలిపారు.

అల్లవరం: ముత్తయిదువులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, దుర్గాదేవి, గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బంగారు లక్ష్మీ రూపుల ధరలు, పండ్లు, పూల ధరలు ఆకాశాన్నంటాయి.

ఉప్పలగుప్తం: గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం మహిళలు ముత్తైదువులకు వాయినాల సమర్పించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆత్రేయపురం: మండలంలోని మహిళలు శుక్రవారం బంగారు రూపులు, నూతన వస్త్రాలను ధరించి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్ల ఆలయాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో భక్తులు కుంకుమ పూజలు చేశారు.

అంబాజీపేట: మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. వరలక్ష్మి సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. ముత్తయిదవులకు వాయినాలు అందించారు. లక్ష్మిదేవిని పువ్వులు, పసుపు, కుంకమ, దీపాలతో అలంకరించారు. పలు ఆలయాల్లో అమ్మవార్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలుగ్రామాల్లో వరలక్ష్మీదేవీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. మహిళలు కలశంలో అమ్మవారిని ఏర్పాటు చేసుకుని నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయాలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపి దీర్ఘసుమంగళిగా వర్ధిల్లాలంటూ వేడుకున్నారు.

మండపేట: మండపేట పట్టణం, మండలంలో అమ్మవారి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. శుక్రవారం ఉదయం, సాయంత్రం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో శ్రావణ శుక్రవారం మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవార్ని ప్రత్యేక అలంకరణ చేశారు.

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్లోని శ్రీదేవి అమ్మవారిని శుక్రవారం వరలక్ష్మీ దేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని కల్వకొలను వీధిలో వేంచేసియున్న వేపచెట్టు శ్రీకనకదుర్గమ్మను 50వేలకు పైగా గాజులతో పిండి శేషు-దీపికదేవి దంపతులు గాజుల గౌరీదేవిగా విశేష అలంకరణ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ముమ్మిడివరం, ఆగస్టు 16: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూపర్‌వైజర్స్, సేల్స్‌మెన్లకు భద్రత కల్పించాలనే డిమాండ్‌తో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్లకార్డులతో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యం విధానం మార్పు నేపథ్యంలో ఐదేళ్ల పాటు ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 18వేల మంది భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. డి.రాంబాబు, నాగ బాబు, ఆర్.డి.ఎస్.రాజు కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ఆత్రేయపురం, ఆగస్టు 16: ఆత్రేయపురం పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. పాము, కుక్క కాటులకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలన్నారు. జడ్పీటీసీ బోణం సాయిబాబు, సర్పంచ్ గెడ్డం సుధ, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వైద్యాధికారిణి వి.సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

ఉప్పలగుప్తం, ఆగస్టు 16: గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 1997-98 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు ఎంతో అవసరమైన ఐరన్ గేట్ బహూకరించారు. విద్యార్థులు హెచ్‌ఎం లంక రాణిని నూతన వస్త్రాలతో సన్మానించగా ఆమె వారిని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు కోడూరి పళ్లంరాజు, నాగిరెడ్డి రాంబాబు, సలాది తాతారావు, ఆదివారపుపేట చిన్నారావు, చిప్పాడ ప్రసన్న, పాలకొల్లు సుబ్రహ్మణ్యం, గెద్దాడ శివ, కడిమి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ మందిరం ప్రారంభం

ఉప్పలగుప్తం, ఆగస్టు 16: ఎన్.కొత్తపల్లి పంచాయతీ కొబ్బరిపేటలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ మందిరాన్ని సర్పంచ్ కుంచే చిట్టికుమారీచిన్నా శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కొంకి వెంకటబాబ్జీ, కొంకి బాలకృష్ణ, ఆర్ఎస్ఎన్, పొత్తూరి వెంకటపతిరాజు, కొంకి రాజారావు, పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, నడింపల్లి వాసురాజు పాల్గొన్నారు.

'కంప్యూటరైజేషన్‌కు సహకరించాలి'

అల్లవరం, ఆగస్టు 16: మండలంలోని ఎనిమిది పీఏసీఎస్‌ల్లో రైతుల రికార్డులను కంప్యూటరైజేషన్ చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు కొమ్మూరి సత్తిబాబు కోరారు. కొమరగిరిపట్నం, ఓడలరేవు, గోడిలంక, గూడాల, అల్లవరం, దేవగుప్తం, మొగళ్లమూరు సొసైటీల పరిధిలోని రైతులు తమ రికార్డులను తప్పనిసరిగా కంప్యూటరైజేషన్ చేయించుకోవాలని కోరారు.

కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

అమలాపురంటౌన్, ఆగస్టు 16: రాష్ట్రంలోని కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులకు ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసి అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ యూనియన్ అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు శుక్రవారం అమలాపురంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. కేరళ తరహాలో రాష్ట్రంలో కొబ్బరి బోర్డు ఏర్పాటుచేసి 50ఏళ్లు నిండిన కార్మికులకు పెన్షన్, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కొండేటి ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే మూఢ నమ్మకాలకు చెక్

మల్కిపురం, ఆగస్టు16: జనవిజ్ఞాన వేదిక కోనసీమజిల్లా ఆధ్వర్యంలో విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాలలోమూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. విద్యతోనే మూఢ నమ్మకాలు సమసిపోతాయన్నారు.రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ రమేష్, వివేకానంద ప్రసాద్, విజయరావు, నల్లి శివ, మురళి, గణేష్ పాల్గొన్నారు.

హీరో చిరంజీవి సేవలు మరువలేనివి

రాజోలు, ఆగస్టు 16: హీరో చిరంజీవి సేవలు మరువలేనివని ఎంపీపీ కేతా శ్రీను అన్నారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రాజోలు తాలుకా చిరుపవన్ సేవాసమితి ఆధ్వర్యంలో తాటిపాక జడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. చిరంజీవి ఐ బ్యాంకు, బ్లడ్ బ్యాంకు ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. కడలి శ్రీకపోతేశ్వరస్వామి, శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయాల్లో చిరంజీవి పేరు మీద కుంకుమ పూజలు నిర్వహించారు. సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, ఉప సర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, రాపాక రమేష్‌బాబు, సూరిశెట్టి శ్రీనివాస్, గుబ్బల ఫణికుమార్, చాగంటి స్వామి, గుండుమోగుల పెద కాపు, కోళ్ళ బాబి, ఉలిశెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.

21న భారత్ బంద్

అమలాపురం టౌన్, ఆగస్టు 16: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఈనెల21న చేపట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ నాయకుడు పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. నడిపూడి డాబా గార్డెన్స్‌లో శుక్రవారం మాల మహానాడు జేఏసీ సభ్యుల సమావేశం నిర్వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్‌తో పాటు విద్యా సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏకే భీమారావు, జగడం సత్యనారాయణ, జల్లి శ్రీనివాసరావు, పోతుల నాగరాజు, ఉండ్రు బాబ్జీ, పెయ్యల పరుశరాముడు, నక్కా సంపత్‌కుమార్, గుబ్బల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండపేట ఎంపీడీవో బదిలీ

మండపేట, ఆగస్టు 16: ఎన్నికల సమయంలో మండపేట ఎంపీడీవోగా వచ్చిన శ్రీదేవి తిరిగి ఆమె పని చేసిన గోపాలపురం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.మండపేట మండల పరిషత్ పరిపాలనాధికారిగాపని చేస్తున్న వి.ప్రసాద్ ఇన్‌చార్జిఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీడీవోగా భారతి



పి.గన్నవరం, ఆగస్టు 16: పి.గన్నవరం ఎంపీడీవోగా ఎం.భారతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ నుంచి ఆమె కృష్ణ జిల్లా పామర్రు మండలం ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. మళ్లీ ఇప్పుడు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన సీహెచ్ త్రిశూలపాణి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలానికి బదిలీ అయ్యారు. ఎంపీడీవో భారతికి ఈవోపీఆర్డీ, కార్యదర్శులు, కార్యా లయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

జూనియర్ సివిల్ కోర్టులు ఏర్పాటు చేయాలి

మండపేట,ఆగస్టు16: మండపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో జూనియర్ సివిల్ కోర్టులను ఏర్పాటు చేయాలని మండపేటకు చెందిన ఐక్య కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జొన్నపల్లి సత్యనారాయణ శుక్రవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. మండపేటలో విలేకరులతో మాట్లాడుతూ మండపేటలో కోర్టు ఏర్పాటుచేస్తే మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల ప్రజలకు, పి.గన్నవరంలో కోర్టు ఏర్పాటుచేస్తే పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు మండలాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు

ముమ్మిడివరం, ఆగస్టు 16: చినకొత్తలంక గ్రామ సచివాలయం వ్యవసాయ సహాయకుడు మట్టా చక్రీకి ఉత్తమ సేవా అవార్డు లభించింది. గేదెల్లంక గ్రామ సచివాలయం మహిళా పోలీసు కొప్పుల లలితా విష్ణుప్రియకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకుడు కె.చిట్టిబాబుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. వీరంతా అమలాపురంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి పురస్కారాలు అందుకున్నారు.

పి.గన్నవరం: పి.గన్నవరం పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ బి.మురళీకృష్ణకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. అమలాపురంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ కృష్ణారావు నుంచి అవార్డును అందుకున్నారు. ఎస్ఐ బి.శివకృష్ణ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎంపీ, ఎమ్మెల్యే



సీసీ రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రావులపాలెం, ఆగస్టు 16: రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. గోపాలపురంలో రూ.30లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు వారు భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఈగ్రామంలో దళితులపై అక్రమ కేసులు పెట్టి ఎన్నో ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఈగ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు అక్రమ కేసులు ఎత్తివేస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. బండారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సరికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత నాయకులు బండారు సంజీవ్, గుత్తుల పట్టాభి రామారావు, చిలువూరి సతీష్‌రాజు, అధికారి నాగు, మైగాపుల గురవయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠం 52వ వార్షికోత్సవాలు ప్రారంభం



రాయవరం, ఆగస్టు 16: వెదురుపాక విజయదుర్గా పీఠం 52వవార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యా యి. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొల్హాపూర్‌కు చెందిన వేదపండితులు పాల్గొని శ్రీమహాలక్ష్మి అమ్మవారికి తిరుమంజనం, అర్చన, హోమం నిర్వహించారు. అనంతరం తమిళనాడు రాష్ట్రం తిరుత్తణికి చెందిన వేదపండితులు పాల్గొని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం, అర్చన, హోమం నిర్వహించారు. పీఠాధిపతి గాడ్ మహాలక్ష్మి అమ్మవారి తిరుమంజనం విశిష్టత, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించడం వల్ల కలిగే శుభాలను వివరించారు. విజయదుర్గా అమ్మవార్ని అన్నవరం దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్, ఇన్‌ఛార్జ్ ఈవో డి.రమేష్‌బాబు అమ్మవార్ని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు.అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ గొర్తిసుబ్రహ్మణ్య శాస్త్రి, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి పాల్గొన్నారు.

సైకిళ్లు పంపిణీ

మల్కిపురం, ఆగస్టు 16: గొల్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో డాక్టర్ ఆదిత్యా సత్యప్రసన్న, స్కోప్‌సూపర్ స్పెషాలటీ హాస్పటల్, జి.రామకృష్ణారావు, కె.వీర్రాజు, ఎస్.జ్యోతిబాబు, జి.హనుమంతరావు సమకూర్చిన ఆరు సైకిళ్లను విద్యార్థులకు అందజేశారు. ఎస్ఎంసీ ఛైర్మన్ ఎం.నాగరాజు, సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ ఎం.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ట్రైనీ డాక్టర్ హత్యను నిరసిస్తూ ర్యాలీ



గడియార స్తంభం సెంటర్లో కొవ్వొత్తులతో ర్యాలీ

అమలాపురం టౌన్, ఆగస్టు 16: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను నిరసిస్తూ శుక్రవారంరాత్రి అమలాపురం గడియారస్తంభం సెంటర్లో ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధకొండ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గడియార స్తంభం సెంటర్లో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఆజాద్ ఫౌండేషన్ కార్యదర్శి ఈవని విశ్వేశ్వరశర్మ, సభ్యులు రంకిరెడ్డికాశీ, మోకా వెంకటసుబ్బారావు, పప్పుల రాంబాబు, దంగేటి రమణ, వెంకట్, వంశీ, కె.వెంకట్ పాల్గొన్నారు.

నేడు వైద్య సేవలు బంద్

రామచంద్రపురం(ద్రాక్షారామ),ఆగస్టు16: రామచంద్రపురంలో ఈనెల 17వతేదీ ఉదయం నుంచి 18వతేదీ ఉదయం వరకు ప్రైవేటు వైద్యశాలల్లో అత్యవసర సేవలు మినహాయించి అన్నిరకాల వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ రామచంద్రపురంశాఖ అధ్యక్ష, కార్యదర్శులు డా. పి.వెంకటరత్నం, జి.జానకిరామచౌదరి తెలిపారు. కోల్‌కత్తాలో ఆర్.జి.ఆర్ ప్రభుత్వ కళాశాలఆసుపత్రిలో ఈనెల9వతేదీ రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసిస్తూ వైద్య సేవలు నిలిపివేస్తున్నామన్నారు.

జాబ్‌మేళాలో 86మంది ఉద్యోగాలకు ఎంపిక

అమలాపురంటౌన్, ఆగస్టు 16: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం బీసీఎస్, దివీస్ తదితర సంస్థలు జాబ్‌మేళా నిర్వహించాయి. 86మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.మనోహర్ తెలిపారు. విజేతలను కార్యదర్శి కరాటం నరసింహరావు, కరాటం ప్రవీణ్, సూర్యకుమారి తదితరులు అభినందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	మిస్టర్ బచ్చన్
శ్రీలలిత	కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	డబుల్ ఇస్మార్ట్
శేఖర్ స్క్రీన్-2	వేద
రమా	ఆయ్
గణపతి	రాయన్
వెంకటపద్మావతిస్క్రీన్-1	డబుల్ ఇస్మార్ట్
వెంకటపద్మావతి స్క్రీన్-2	తంగలాన్

భారతమాత విగ్రహావిష్కరణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 16: పట్టణంలో శివాలయం ఎదురుగా పార్కు వద్ద ఏర్పాటుచేసిన భారతమాత విగ్రహాన్ని శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆవిష్కరించారు. విగ్రహం ఏర్పాటు చేసిన సలాది సతీష్‌నాయుడును సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమ, కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, అడబాల సత్యనారాయణ, సీనియర్ నాయకులు ఆర్వినాయుడు, యాండ్ర బుల్లబ్బులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు, విళ్ల వెంకటేశ్వరరావు, బీజేపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, ఎస్సీ మోర్చా జోన్ అధ్యక్షుడు పలివెల రాజు, పట్టణ అధ్యక్షుడు కేశవరాఘవేంద్ర, జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్ కొట్టువాడ హరిబాబు, నియోజకవర్గ కోకన్వీనర్ సలాది శేఖర్, మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

పప్పు దినుసుల క్లస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్



రాయవరం, ఆగస్టు 16: మాచవరం గ్రామ పరిధిలో నిర్మిస్తున్న పప్పుల దినుసుల క్లస్టర్‌ను శుక్రవారం కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ పరిశీలించారు. ఆగస్టు నెలాఖరులోపు యంత్రాల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.14.83కోట్లతో చిన్న పప్పు దినుసుల మిల్లులు నడిపేవారు ఎస్‌పీవీ కింద్ర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పప్పు దినుసుల క్లస్టర్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈక్లస్టర్ నిర్మాణంలో 70శాతం కేంద్ర ప్రభుత్వం వాటా, 20శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటా, 10శాతం ఎస్‌పీవీ వాటాగా చెప్పారు. జర్మన్ సాంకేతికతతో నిర్మిస్తున్న ఈపప్పు దినుసుల క్లస్టర్‌లో పప్పు దినుసుల శుభ్రపర్చడం, పాలిష్, వ్యర్థాలు తొలగించడం కలర్ గ్రేడింగ్ ప్యాకేజింగ్ వంటివి జరుగుతాయన్నారు. ఈక్లస్టర్ అందుబాటులోకి వస్తే 150 చిన్న పప్పుల దినుసుల మిల్లులు నిర్వహించేవారు లబ్ధిపొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల కేంద్రం జిల్లా జనరల్ మేనేజర్ డీకేవీ ప్రసాద్, ఆర్డీవో సుధాసాగర్, అధికారులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేయాలి

అమలాపురంటౌన్, ఆగస్టు16: గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను పంచాయతీరాజ్ శాఖ నుంచి తొలగించి వైద్య, ఆరోగ్య శాఖలో విలీనం చేయాలని కోరుతూ జిల్లాలోని ఏఎన్ఎంల బృందం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించింది. సచివాలయాల్లోనే కొనసాగించాల్సి వస్తే ఎంపీహెచ్ఎఫ్(ఎఫ్)గా మార్చి జాబ్‌చార్ట్ విడుదల చేయాలని, పదోన్నతులు కల్పించాలని, ఏ ప్రభుత్వ శాఖ కింద పనిచేస్తున్నామో స్పష్టమైన అధికారిక ఉత్తర్వులు విడుదల చేయాలని, గత ప్రభుత్వం విడుదల చేసిన పదోన్నతుల జాబితాను పునఃప్రారంభించాలని, ఎక్కడి నుంచైనా బయోమెట్రిక్ వేసుకునే వెసులుబాటు కల్పించాలని, వైద్య-ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలతో సమానంగా సచివాలయ ఏఎన్ఎంలకు అలవెన్సు అందించాలని కోరుతూ కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొరకు వినతిపత్రం అందించారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

రావులపాలెం, ఆగస్టు 16: స్థానిక సత్యసాయి కళాశాల ప్రాంగణంలో ఈనెల21న నిర్వహించే మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఆవిష్కరించారు. టీడీపీ యువ నాయకుడు బండారు సంజీవ్ ఇతర నాయకులతో కలిసి మంత్రి సుభాష్‌ను జాబ్‌మేళాకు ఆహ్వానించారు. మెగా జాబ్‌మేళా జరిగే ప్రాంగణాన్ని డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత నాయకుడు బండారు సంజీవ్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్‌రాజు పరిశీలించి పలు సూచనలు చేశారు.

పందుల పెంపకం గుడిసెలు తొలగించాలని ధర్నా



కె.గంవరం, ఆగస్టు 16: పామర్రు ఉన్నత పాఠశాల వద్ద పామర్రు నుంచి కూళ్ల వెళ్లే రహదారిలో ఏర్పాటుచేసిన పందుల పెంపకం గుడిసెలు తొలగించాలని పామర్రు, అముజూరు, కూళ్ల గ్రామస్తులు శుక్రవారం ధర్నా చేశారు. గుడిసెలు తొలగించాలని నినాదాలు చేశారు. దీంతో టీడీపీ నాయకులు మరివాడ సూరిబాబు, ఎనుమల గోపాలకృష్ణ, మరివాడ చిన్నికృష్ణలు పందుల పెంపకందారులతో చర్చలు జరిపారు. స్వచ్ఛందంగా గుడిసెలు తొలగించడానికి వారు అంగీకరించారు. అయితే తమకు తగిన సహాయం చేయాలని, మరో ప్రాంతం చూపించాలని కోరారు. దీనికి టీడీపీ నాయకులు భరోసా ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. కూటమి నాయకులు దేవరపల్లి వెంకటేశ్వరరావు, పెంకే నాగేశ్వరరావు, కడలి వెంకట రమణ, వినయ్, నున్న సత్యనారాయణ, పంపన శ్రీను పాల్గొన్నారు.

రాయవరం ఎస్ఐగా బుజ్జిబాబు



రాయవరం, ఆగస్టు 16: రాయవరం ఎస్ఐగా పి.బుజ్జిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బిక్కవోలు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన జి.నరేష్ వీఆర్‌కు వెళ్లారు. ఎస్ఐ బుజ్జిబాబుకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

ఘనంగా విలీన దినోత్సవం

యానాం, ఆగస్టు 16: ఫ్రెంచి పాలనలో ఉన్న పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాం ప్రాంతాలు 1962 ఆగస్టు 16న భారతదేశంలో విలీనమైన సందర్భాన్ని పురస్కరించుకుని చట్టబద్ధ విలీన దినోత్సవాన్ని (డిజూర్ ట్రాన్స్‌ఫర్‌డే)ను శుక్రవారం యానాంలో నిర్వహించారు. స్థానిక గాంధీ పార్కులో అమరవీరుల స్థూపం వద్ద పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందం, పోలిశెట్టి అధినారాయణ(అధిబాబు) శంకర్, గూటం రాంబాబు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

మంత్రితో ఎమ్మెల్యే అశోక్ భేటీ

యానాం, ఆగస్టు 16: యానాం పర్యటనకు వచ్చిన పుదుచ్చేరి ప్రజా పనులశాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్‌తో స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భేటీ అయ్యారు. కురసాంపేట మురుగు కాలువ సమస్య, దిగువ ప్రాంతాల్లో మంచినీటి కొరత తదితర అంశాలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చర్చించినట్టు చెప్పారు. వీటిపై ఆయా శాఖల అధికారులకు మంత్రి ఆదేశాలు జారీచేశారని ఎమ్మెల్యే తెలిపారు.

కామిశెట్టికి ఘన నివాళి

యానాం, ఆగస్టు 16: ఫ్రెంచివారి పాలనలో 1931 నుంచి 1940 వరకు యానాం మేయర్‌గా సేవలందించిన కామిశెట్టి వేణుగోపాలరావు నాయుడు జయంతి నిర్వహించారు. స్థానిక ఫెర్రీరోడ్డులోని ఆయన విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందం, సమాచారాశాఖాధికారి కె.ఎల్.వి.ప్రసాద్, శంకర్ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఏరియా ఆసుపత్రిలో మంత్రి సుభాష్ ఆకస్మిక తనిఖీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 16: రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిని మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వార్డుల్లోకి వెళ్లి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా ఆరా తీశారు. మెరుగైన సేవలందించాలని వైద్యులను ఆదేశించారు. ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డా. ప్రవీణ్, వైద్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజోలు, ఆగస్టు 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజోలు బాలికల గురుకుల పాఠశాల 5,6 తరగతుల్లో, జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి 5వ తరగతిలో 39 సీట్లు, 6వ తరగతిలో 11 సీట్లు, జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో నాలుగు, బైపీసీ విభాగంలో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల17వ తేదీ (శనివారం) దరఖాస్తులకు ఆఖరు తేదీ అన్నారు. పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈనెల 17వ తేదీ రెండు గంటలకు లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తామన్నారు.

కైలాస భూమి అభివృద్ధికి చర్యలు



కొత్తపేట కైలాస భూమి సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, ఆగస్టు 16: కొత్తపేట కైలాస భూమిలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రూ.40లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం వారు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మిభాస్కరరావు, ఆకుల రామకృష్ణ, నంబూరి రెడ్డియ్య, ధర్నాల రామకృష్ణ, చిలువూరి సతీష్‌రాజు, చింతం విజయకృష్ణ మోహన్, బండారు బుల్లితాత, యల్లమిల్లి జగన్మోహన్, విల్ల వీరమారుతీప్రసాద్, అద్దంకి చంటిబాబు, పల్లి శాంతి, చోడపనీడి భాస్కరరావు, బీర ఇసాక్, కముజు వెంకటేశ్వరరావు, రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోడి గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అల్లవరం, ఆగస్టు 16: గోడి బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో 5,9 తరగతులు, ఇంటర్ బైపీసీ గ్రూపులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల19వ తేదీ ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డుతో ప్రవేశ పరీక్షకు హాజరుకావాలన్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని ప్రిన్సిపాల్ చెప్పారు.

గోదావరిలో స్నానానికి దిగిన యువకుడి గల్లంతు

కె.గంగవరం, ఆగస్టు 16: కోటిపల్లి గోదావరిలో స్నానానికి దిగి యువకుడు గల్లంతయ్యాడు. పామర్రు ఏఎస్ఐ కె.రాంబాబు తెలిపిన వివరాలివి. తోటపేటకు చెందిన కందుల నరేంద్ర మిత్రుడు కంచుమర్తి అంజితో కలిసి కోటిపల్లి గోదావరి నదిలో స్నానం చేయడానికి వచ్చాడు. అక్కడ స్నానానికి దిగిన నరేంద్ర ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతయ్యాడు. రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.